క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థుల ఎత్తు కొలుస్తున్న సిబ్బంది

పలాస: మండలంలోని మామిడిపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెంటికోట ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. రాష్ట్రీల బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు రక్త పరీక్షలతో పాటు బరువు, ఎత్తు తదితర పరీక్షలు చేసి వారికి కావాల్సిన ఆరోగ్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో బొడ్డపాడు ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆశవర్కర్ జ్యోతి, పాఠశాల హెచ్ఎం కె.రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఆకస్మిక తనిఖీలు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

పలాస: మండలంలోని రెంటికోట అంగన్‌వాడీ కేంద్రాన్ని పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలోని బియ్యం తదితర నిల్వలు, రికార్డులు పరిశీలించారు. అలాగే స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో వసంతకుమార్, పంచాయతీ రాజ్ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, వీఆర్వో అన్ను ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇబ్బందులకు గురి చేయడం సరికాదు


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారస్తులు

టెక్కలి: సంక్రాంతికి ముందు తమను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఫుట్‌పాత్ వ్యాపారస్తులు అన్నారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని కలిసి తమ గోడు వినిపించారు. పాత బస్టాండ్‌లో కొంత భాగం, పట్టు మహాదేవి కోనేరు గట్టుపై చిరు వ్యాపారాలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో యు.మాధవరావు, వరదరాజులు, తిరుపతి, చిన్నమ్మడు, సీత, మల్లి, నీలవేణి, సీపీఎం నాయకుడు కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం


ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాశీబుగ్గ: వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు డి.ఉమామహేశ్వరరావు అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబడం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారుల చైతన్య ప్రతిజ్ఞ గురువారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, లక్ష్మీపతి, జగదీశ్వరరావు, షణ్ముఖరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కంచిలి: మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం పరామర్శించారు. గొల్ల కంచిలి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వంజరాన నారాయణ(50) ఇటీవల కిడ్నీలు ఫెయిల్ అవ్వడంతో మృతి చెందారు, చిన్నకొజ్జిరియా గ్రామానికి చెందిన పిరియా సూరయ్య(75) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, సర్పంచ్ గొనప సీతారాం, దొక్కరి నారాయణ తదితరులు ఉన్నారు.

ఎగిసే కెరటాలు..!

క్రీడ ఏదైనా మెలకువలు నేర్పే మైదానం అక్కడి సముద్ర తీరం. అలసట లేకుండా అలలతో పోటీపడుతున్నారు. సముద్రపు గాలులు వీస్తున్నా చెమట చిందిస్తున్నారు. ఫలితంగా మారుమూల మత్స్యకార గ్రామంలో పతకాల పంట పండిస్తున్నారు. వారే డొంకూరు గ్రామానికి చెందిన క్రీడాకారులు. సదుపాయాల కొరత వేధిస్తున్నా సాగర మైదానంలో సత్తాచాటుతున్న క్రీడాకారులను పరిశీలిస్తే...

– ఇచ్ఛాపురం రూరల్



సముద్ర తీర ప్రాంతంలో ప్రాక్టీస్ చేస్తున్న డొంకూరు విద్యార్థులు

- క్రీడల్లో రాణిస్తున్న మత్స్యకార గ్రామం
- సముద్ర తీరమే సాధన స్థలం
- ప్రత్యర్థిని చిత్తు చేయడమే లక్ష్యం
- జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం

ఇచ్ఛాపురం మండల కేంద్రానికి పాతిక కిలోమీటర్ల దూరంలో, సముద్రపు ఒడ్డున ఉన్న ఏకైక మత్స్యకార గ్రామం డొంకూరు. ఇక్కడ ఉన్నవారంతా మత్స్యకార, అగ్నికుల క్షత్రియ కుటుంబాలే. చేపల వేట ప్రధాన వృత్తి. ఇక్కడ పిల్లలు ఆటల్లో చిచ్చర పిడుగుల్లా రాణిస్తూ, సాగర తీరంలో క్రీడా ముత్యాలుగా వెలుగొందుతున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటలు ఆడేందుకు క్రీడా మైదానం లేకపోయినప్పటికీ, సముద్ర తీరమే క్రీడా మైదానంగా ఎంచుకున్నారు. ఈ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వజీర్ అహ్మద్ కోచ్‌గా వ్యవహరిస్తూ బాలబాలికలకు తర్ఫీదునిస్తున్నాడు. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు బరిలో దిగితే ఎలాంటి ప్రత్యర్థినైనా చిత్తు చేసి పతకాల పంట పండిస్తున్నారు.

బరిలో దిగితే పతకాల మోతే

క్రీడ ఏదైనా డొంకూరు విద్యార్థులు బరిలో దిగితే పతకాల మోత మోగాల్సిందే. ఇక్కడి విద్యార్థులు అనేక పోటీల్లో సత్తాచాటి పతకాలను సాధిస్తున్నారు.

- శ్రీకాకుళం జిల్లా బాల, బాలికల విభాగం ఖో-ఖో జట్లుకు ఈ పాఠశాలలో చదువుతున్న దున్న మీనా, బడే ధనలక్ష్మీ, బడే కార్తీక్, బడే జస్వంత్‌లు ప్రాతినిత్యం వహిస్తున్నారు.
- గత నెల నవంబర్ 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొన్న శ్రీకాకుళం ఖోఖో జట్టుకు కెప్టెన్‌గా దున్న మీనా వ్యవహరించి రజిత పతకం కైవసం చేసుకున్నారు. అలాగే 2023 నవంబర్‌లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో బాలికలు విభాగంలో బంగారు పతకం సాధించారు. అదేవిధంగా ఇటీవల జరిగిన 34వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర జిల్లా బాలికల ఖోఖో పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు, వచ్చే ఏడాది జనవరిలో ఝార్ఖండ్‌లో జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు అర్హత సంపాదించారు.
- అండర్-14 విభాగంలో వచ్చే ఏడాది జనవరిలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు దున్న మీనా ఆంధ్రప్రదేశ్ జట్టుకు సారథ్యం వహించనుంది.
- ఇటీవల చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో బాలికల విభాగంలో వుచ్చ గీత అసమాన ప్రతిభను కనబర్చి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది.
- 2023-24లో గుంటూరు జిల్లా వేదికగా జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న బుడ్డ భరత్ చంద్ర అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో పాల్గొని షాట్‌పుట్‌లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. అలాగే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో రజిత పతకాన్ని పొందాడు.
- 2024-25లో అన్నమయ్య, బాపట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ 63వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న బి.లావణ్య, జె.అనూ బంగారు, రజిత పతకాలు గెలుచుకొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.


పతకాలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

క్రీడా మైదానం ఉంటే బాగుణ్ణు



జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మా విద్యార్థులు ప్రతిభను కనబరుస్తున్నారు. సుమారు 50 మంది వరకు విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. మా బడికి సంబంధించి క్రీడా మైదానం లేకపోవడం ఇబ్బందిగా ఉంది. 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ప్రభుత్వం మంజూరు చేస్తే మరింత మంది విద్యార్థులను క్రీడాకారులుగా తయారు చేయవచ్చు.

– జె.సరోజిని,
హెచ్ఎం, డొంకూరు ఉన్నత పాఠశాల

పూర్వ విద్యార్థుల సహకారం



సముద్ర తీరాన్నే క్రీడా మైదానంగా మార్చుకొని విద్యార్థులకు వివిధ క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడం జరుగుతోంది. ముఖ్యంగా రాష్ట్రస్థాయి క్రీడల్లో ఆడిన పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, శంకర్, పురుషోత్తం, పవన్‌లు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంలో తోడ్పడుతున్నారు. మా విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడల్లో చూడాలన్నదే మా లక్ష్యం.

– వజీర్ అహ్మద్,
వ్యాయామ ఉపాధ్యాయుడు, డొంకూరు హైస్కూల్

సమన్వయంతో పనిచేద్దాం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: నియోజకవర్గంలో సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందని, కూటమి పార్టీలకు చెందిన నాయకులు చేస్తున్న అక్రమాలు, ఆగడాలను అడ్డుకుందామని పిలుపునిచ్చారు. ముందుగా పంచాయతీలు, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో ప్రతీ కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ భవిష్యత్ కార్యచరణ చేపడతామని తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి స్థాయిలో ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఈ విషయంలో ప్రతీ ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే ఈనెల 21వ తేదీన టెక్కలిలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు. రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం, అన్నదానం, వసతి గృహ విద్యార్థులకు రగ్గులు పంపిణీ తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, ఎస్.సత్యం, కె.రవికుమార్ గాంధీ, ఎన్.సత్యరాజ్, హెచ్.వెంకటేశ్వరరావు, పి.రమేష్, కె.సంజీవ్, ఆర్.జయమోహన్, ఎస్.బాలకృష్ణ, జి.మోహన్‌రెడ్డి, బి.ఉదయ్, ఎస్.జనార్ధన్, జె.బాబురావు, కె.నారాయణమూర్తి, బి.మోహన్‌రెడ్డి, డి.భూషణ్‌రెడ్డి, టి.నారాయణ, డి.రామకృష్ణారెడ్డి, బి.వెంకటరమణ, వి.తవిటయ్య, కె.కామేష్, ఎస్.రాజారావు, జి.చిరంజీవి, శివారెడ్డి పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలకు తరలిరండి

కంచిలి: ఈనెల 21వ తేదీన నియోజకవర్గ కేంద్రం ఇచ్ఛాపురంలో నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలకు పార్టీ క్యాడర్ అంతా తరలి రావాలని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో జగనన్న పేరున ప్రత్యేక పూజలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం విజయ స్థూపం వద్ద జన్మదిన కేక్ కట్‌చేసే కార్యక్రమాలకు అంతా హాజరవ్వాలని కోరారు.

నియోజకవర్గం వ్యాప్తంగా వేడుకలు

ఈనెల 21వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఇచ్ఛాపురం నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జీవనోపాధి కల్పించడమే లక్ష్యం

- వెలుగు డీపీఎం నారాయణరావు


అవగాహన కల్పిస్తున్న డీపీఎం నారాయణరావు

వజ్రపుకొత్తూరు: ప్రతీ కుటుంబానికి జీవనోపాధి కల్పించడమే లక్ష్యమని వెలుగు డీపీఎం బి.నారాయణరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ క్లస్టర్‌పై రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళా కిసాన్ సభ్యులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. కొమరల్తాడ గ్రామాన్ని సమీకృత వ్యవసాయ క్లస్టర్ గ్రామంగా గుర్తించి 300 కుటుంబాలకు జీవనోపాధులు కల్పించడమే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సోంపేట ఏసీ సీహెచ్ రామ్మోహనరావు, ఏపీడీవో రమేష్ నాయుడు, ఎఫ్‌పీవో ఏపీఎం ఈశ్వర్, ఎఫ్‌పీవో డీపీఎం ధనుంజయ, ఏవో కిరణ్‌వాణి, ఎఫ్‌పీవో అధ్యక్షుడు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి'


కాశీబుగ్గ: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


టెక్కలి: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

టెక్కలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ టెక్కలిలో పలు ప్రజా సంఘాల నాయకులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో బి.వాసుదేవరావు, ఎస్.షణ్ముఖరావు, బి.ప్రభాకరరావు, కోత ధర్మారావు, కె.ఎల్లయ్య, కె.కామేశ్వరరావు, ఎ.షణ్ముఖరావు, ఎం.పురుషోత్తం, బి.దాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని స్థానిక ఆది ఆంధ్రా వీధిలో యువకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యు.దుర్గాప్రసాద్, వై.జగన్, వై.కృష్ణ, కె.మహేష్, చంద్రం, దండాసి, శివకృష్ణ, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తక్షణమే చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన చేశారు. కార్యక్రమంలో బి.నారాయణరావు, చల్లా రామారావు, కె.దాలయ్య, డీఏ స్టాలిన్, కె.కామేశ్వరరావు, ఎ.లోకనాథం, ఎ.మాధవరావు, పి.రాజేష్, సుంకు గోపి, కె.శ్రీను, వినోద్‌కుమార్, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు బీజేపీ అహంకారానికి నిదర్శనమని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తక్షణమే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నందిగాం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఎస్సీ సెల్ కో-కన్వీనర్ అంబోడి సురేష్ అన్నారు. దేశ ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని ఆయనను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కాశీబుగ్గ: కేంద్రమంత్రి అమిత్ షా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలాస కాంగ్రెస్ నాయకులు తెంబూరి మధుసూదనరావు, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, తంగుడు వీర్రాజు, రమేష్ సాహు, తంగుడు సత్యం, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని తహసీల్దార్ ఎన్.వెంకటరావు సూచించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో గురువారం కొఠారీలో నిర్వహించిన ఎయిడ్స్ నివారణ, నియంత్రణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపకూడదన్నారు. డ్రగ్స్, రక్తహీనత, పౌష్టికాహారం గురించి జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, లింక్ వర్కర్ గున్న రవికుమార్, వీఆర్వో చిరంజీవి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్ష


పరీక్ష ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. మండలవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 5వ తరగతి చదువుతున్న 135 మంది విద్యార్థులకు పరీక్షలో పాల్గొన్నారు. లెవల్ వన్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి, రెండో లెవల్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అంతకుముందు ప్రతిభ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్, ఉపాధ్యాయులు కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం గొల్లపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి పూజలు



మార్గశిర గురువారం పురస్కరించుకొని లక్ష్మీదేవికి మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవికి గురువారం పంచామృతాలు, గంగాజలంతో అభిషేకం జరిపారు. అనంతరం సహస్ర పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– ఇచ్ఛాపురం

359వ రోజుకు దీక్షలు



కవిటిలో నిర్వహిస్తున్న బెంతొరియా కులస్తుల రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 359వ రోజుకు చేరుకున్నాయి. తమ కులానికి ఎస్టీ రిజర్వేషన్ సాధన కోసం దీక్షలు చేపడుతున్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో దీక్షలో మాణిక్యపురం ఎంపీటీసీ భర్త సంతోష్‌కుమార్ సాహూ, బృందావన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

– కవిటి

దుప్పట్లు పంపిణీ



కవిటి కేంద్రంగా పనిచేస్తున్న స్పెషల్ గయ్స్ ఫౌండేషన్(ఎస్‌జీఎఫ్) స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని కవిటి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పొల్లాయి లక్ష్మీదేవి అన్నారు. గురువారం కవిటి మండలం కొత్తపాలెం కేజీబీవీ ఆవరణలో స్పెషల్ గయ్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లోని కేజీబీవీల్లోనూ పంపిణీ చేసినట్టు స్పెషల్ గైస్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

– కవిటి

రైతులను ఆదుకోవాలి


తడిసిన వరి ఓవులను పరిశీలిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి కోరారు. మండలంలోని డీజీపురం, రేఖాదేవిపురం, భైరిపురం తదితర గ్రామాల్లో కల్లాలో తడిసిన వరి ఓవులు, వరి కుప్పలను గురువారం పరిశీలించారు. వర్షం కురవడం వలన వరి చేనుకుప్పలు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్ పరిశీలన

కంచిలి: మండల కేంద్రం కంచిలి-2 సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు గురువారం పరిశీలించారు. అనంతరం తలతంపర పంచాయతీ పరిధిలో నిర్మితమవుతున్న మినీ గోకులం షెడ్స్, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తర్వాత తలతంపర, కొక్కిలిపుట్టుగ, మండపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించారు.

ఉద్యోగుల సహకారంతోనే పురోగతి

కవిటి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ డా.బి.అశోక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలానికి మంజూరైన 181 సీసీరోడ్లను జనవరి నెలాఖరుకు పూర్తి చేసేలా పనులు వేగవంతం అవుతున్నట్లు అధికారులు వివరించారు.